ఓం శ్రీసాయిరాం

## పుట్టిననాటి గట్టిదీవెనలు

ఆనంద స్వరూపులారా! అందుకోండి పుట్టిననాటి గట్టి దీవెనలు. ఆయురారోగ్య శాంతి సంతోష సౌఖ్యములతో, భక్తి జ్ఞాన వైరాగ్యములతో అనుగ్రహపాత్రులై ఆత్మను చేరరండు. అస్థిరమైన అవని భ్రాంతులు ప్రధానముగా ఆశించక సత్యమైన, నిత్యమైన, స్థిరమైన ఆస్తులను ఆశించి, మోహించి ఆనందమొందుడు. గడచిన నిముషము మీది కాదు. ఉన్న నిమిషమె సత్యమని భావించి, ఎప్పటికప్పుడు సిద్ధముగా మీరు పరమాత్మను చేరుటకు సంసిద్ధులు కండు. భగవత్ ప్రసాదమైన కాలమును, మనసును, కర్మను అపవిత్రము చేయకుడు. క్షుద్రమైన ఫలితములకై ప్రార్థించకుడు. అక్షరమైన అనుగ్రహమునకు ఆరాటపడుడు. అది ఒక్కటుండిన ఫలసిద్ధిగాంచగలరు.

ఇప్పటినుండే, ఈ నిముషమునుండే అట్టి ప్రార్థనలు ప్రారంభించుడు.

### ప్రార్థన

సిరులకేమి ప్రసన్న చిత్తుండవైనచో
జాలు నా కదె పది వేలు తండ్రీ!
సుఖ సంపదలకేమి సుముఖుండవైనచో
జాలు నా కదె పది వేలు తండ్రీ!
కోర్కెలకేమి నీకు గటాక్షమున్నచో
జాలు నా కదె పది వేలు తండ్రీ!
విభవానికేమి నీ యభిమానమున్నచో
జాలు నా కదె పది వేలు తండ్రీ!
ఇచ్చినవి యేవో యున్నవి యింతె చాలు
అధికములకేమి యవి యెప్పుడైన గలుగు
వీడు నా భక్తుడని యెల్ల వేళ నీకు
ఒక్క రీతి ననుగ్రహ మున్న జాలు.